క్లుప్తంగా

చిల్డ్రన్ స్పేస్ క్లబ్ సభ్యులకు గవర్నర్ అభినందనలు



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల్లో చదువుతూ గుంటూరు అమరావతిరోడ్డులోని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో సభ్యులుగా ఉన్న విద్యార్థులను రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మంగళవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో అభినందించినట్లు చిల్డ్రన్ స్పేస్ క్లబ్ వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసినట్లు పేర్కొన్నారు.

టీడీపీలో గ్రూపుల కొట్లాట



పాత గుంటూరు: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో టీడీపీ గ్రూపుల మధ్య వివాదం రెండో రోజు కొనసాగింది. టీడీపీ నేత సయ్యద్ ముజీబు వర్గం మంగళవారం నియోజకవర్గంలోని పదో వార్డులో బాబుతో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యకర్తలతో వార్డుకు వచ్చారు. స్థానిక టీడీపీ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వీల్లేదని నసీర్ వర్గం అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాదనలు పెరిగి కొట్లాటకు దారి తీసింది. సమాచారం అందుకున్న పాత గుంటూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్నారు.

జీజీహెచ్‌కు వైద్య పరికరాలు అందజేత



గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆసుపత్రి అనస్థీషియా విభాగానికి ప్రతి ఏడాది రెండు వేల డాలర్లను అందచేయనున్నట్లు జింకానా మాజీ అధ్యక్షుడు, ఎంసీహెచ్ కో–ఆర్డినేటర్, గుండె జబ్బుల మత్తు వైద్యులు డాక్టర్ త్రిపురనేని రవి అన్నారు. నాట్కోలో మంగళవారం రూ.5లక్షల విలువ గల ల్యారింగ్ స్కోప్, ఆక్టోపస్ పరికరాలను డాక్టర్ త్రిపురనేని రవి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌కు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ త్రిపురనేని రవి మాట్లాడుతూ ఆసుపత్రిలో అనస్థిషియా విభాగానికి రూ.4 లక్షల విలువ గల ల్యాబ్ ట్యాప్, ఎల్‌సీడీ ప్రాజెక్టులు, అవసరమైన పుస్తకాల కొనుగోలుకు అందిస్తున్నట్లు చెప్పారు. ఆపరేషన్‌కు ముందు, ఆపరేషన్ తర్వాత నొప్పి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై వివరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న సమయంలో హెర్నియా ఆపరేషన్, థైరాయిడ్ గడ్డలు ఆపరేషన్ చేసినట్లు చెప్పారు. డాక్టర్ త్రిపురనేని చేసిన సూచనలు పీజీ వైద్య విద్యార్థులు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనస్థీషియా హెచ్ఓడీ డాక్టర్ పోలయ్య, జింకానా కో–ఆర్డినేటర్లు డాక్టర్ హనుమంత రావు, డాక్టర్ బాలభాస్కర్, నాట్కో సమన్వయకర్త వై.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ కమిషనరేట్ ముట్టడికి యత్నం

అడ్డుకున్న పోలీసులు

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్రంలో కరవు మండలాల్లోని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు చుట్టుగుంటలోని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ముందుగా సమాచారం అందుకున్న పోలీసులు నగరంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, కిసాన్ యువమోర్చా నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, టి.శ్రీనివాస్, ఎం.ప్రసాద్, వైపీ సుబ్బారావు, వెంకటసుబ్బయ్య, నాగేంద్ర, గోవిందరావు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల విముక్తి ప్రదాత పూలే



బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న భీమ్ సేన సేవాదళ్ నాయకులు

వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

నెహ్రూనగర్: అణగారిన కులాల విముక్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే అని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ పేర్కొన్నారు. మంగళవారం పూలే వర్ధంతి సందర్భంగా భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం ఆధ్వర్యంలో ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు విద్య నేర్చుకోవాలనే ఉద్దేశంతో తన భార్య సావిత్రి భాయి పూలేకు విద్య నేర్పించి మొట్టమొదటి మహిళ గురువును తయారు చేశారని కొనియాడారు. వివిధ సంఘాల నాయకులు బ్రహ్మయ్య, శ్రీనివాస్, గోవింద్, నరసింహారావు, లక్ష్మీనారాయణ, జోసఫ్, రాజకుమారి, ముత్తయ్య, ప్రభుదాస్ పాల్గొన్నారు.

- దేశంలో సమాజ మార్పు కోసం నిరంతరం కృషి చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిరావుపూలే అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ కొనియాడారు. మంగళవారం పూలే వర్ధంతిని పురస్కరించుకుని ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్న కోటేశ్వరరావు, సుజనా, హసీనా బేగం, అంకం శ్యామ్, జల్ది మోహన్ పాల్గొన్నారు.
- దేశంలో అసమానతలపై, సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు మహాత్మ జ్యోతీరావు పూలే అనునిత్యం పోరాడారని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు పేర్కొన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని కాకాని రోడ్డులోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బయ్య, మస్తాన్, రమణ పాల్గొన్నారు.
- మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను నేటి యువత కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వర రావు పేర్కొన్నారు. పూలే వర్ధంతి పురస్కరించుకుని ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హనుమంతురావు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వెంకట సుబ్రహ్మణ్యం, తిరుపతి రావు పాల్గొన్నారు.

ప్రజా రవాణా శాఖలో 'వైఎస్సార్' ఉద్యోగ సంఘానికి గుర్తింపు



సంఘం గుర్తింపు పత్రాన్ని ప్రదర్శించిన వైవీ రావు, డీఎస్పీ రావు, ఉద్యోగులు

పాత గుంటూరు: ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ)లో వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు గుర్తింపు సంఘంగా హోదా దక్కడంపై గుంటూరు జిల్లా యూనియన్ నాయకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సంఘ నాయకులు, ఉద్యోగులకు మిఠాయిలు పంచి పెట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.వి.రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఉద్యోగ సంఘానికి గుర్తింపు హోదా ఇచ్చి మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్పీ రావు మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంస్థ అభివృద్ధికి పాటుపడతామని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తమ సంఘానికి గుర్తింపు హోదా కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.వి.రెడ్డి, రీజినల్ కార్యదర్శి జయరావు, గ్యారేజీ అధ్యక్షులు ఎం.జోసఫ్,ఎస్.హెచ్.రాజు, గుంటూరు 1,2 డిపోల అధ్యక్షులు రమేష్, పి.ఎస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి డెర్మాటలాజీ పీజీ వైద్య విద్యార్థులు ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 25, 26 తేదీల్లో ఏలూరులో డెర్మాటలాజీ రాష్ట్ర సదస్సులో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి డెర్మాటలాజీ పీజీ వైద్య విద్యార్థులు జ్యోతిర్మయి, అక్షయ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొని మొదటి బహుమతులు సాధించారని చెప్పారు. వీరు జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు కూడా ఎంపికయ్యారని వెల్లడించారు. విజేతలను అభినందించారు. డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ హనుమాన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలుగా భాష్యం విద్యార్థులు



విజేతలను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: చదువుతో పాటు భాష్యం విద్యార్థులు జాతీయస్థాయి క్రీడల్లో అద్భుతంగా రాణిస్తున్నారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. ఈనెల 26న అండర్ ఆర్మ్ క్రికెట్ టోర్నమెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా గార్గేయపురంలో నిర్వహించిన అండర్–16 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన భాష్యం రామసేతు క్యాంపస్ విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్‌లో విద్యార్థులను ఆయన అభినందించారు. వివిధ జిల్లాల నుంచి 11 జట్లు పాల్గొనగా, గుంటూరు జిల్లా జట్టు ప్రథమస్థానంలో నిలిచి, జాతీయజట్టుకు ఎంపికైనట్లు వివరించారు. గుంటూరు జిల్లా జట్టుకు భాష్యం విద్యార్థులు డి.వాసుదేవ్ కెప్టెన్‌గా వ్యవహరించగా, డి.గురుప్రసాద్, పి.మోహిత్‌చౌదరి, వై.ప్రేరణ్ సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అదేవిధంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ 2023–24 ఆధ్వర్యంలో అక్టోబర్ 29న రాజమహేంద్రవరంలో జరిగిన అండర్–14 ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్న భాష్యం రామసేతు విద్యార్థి షేక్ మొహ్మద్ సాద్ భోపాల్‌లో జరగనున్న జాతీయస్థాయి ఎయిర్ రైఫిల్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థిని అభినందించారు.

ముఖ్యమంత్రి స్ఫూర్తితో నేత్రజ్యోతి కార్యక్రమాలు

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- వడ్లమూడిలో 767మందికి కళ్లజోళ్లు అందజేత



మహిళకు కళ్లజోడు అందిస్తున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు సాగుతున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో బజరంగ్ నేత్రజ్యోతి ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత్ర జ్యోతి వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారిలో 767 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పేదల ఇంటి ముందుకే సంక్షేమ ఫలాలను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తరహాలోనే బజరంగ్ ఫౌండేషన్ సేవలను కూడా పేదల ఇంటి వద్దకు తీసుకువెళుతున్నట్లు తెలిపారు. కళ్లజోళ్లు తీసుకున్న వారు క్రమం తప్పకుండా ధరించినట్లయితే భవిష్యత్తులో తలెత్తే కంటి సమస్యలు చాలావరకు తగ్గిపోతాయని సూచించారు.

నేడు వెంకటకృష్ణాపురంలో కళ్లజోళ్ల పంపిణీ..

పెదకాకాని: బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా ఈనెల 23న వెంకటకృష్ణాపురంలో నిర్వహించిన నేత్రజ్యోతి వైద్య శిబిరంలో అవసరమైన 555 మందికి కళ్లజోళ్లు సిద్ధం చేసినట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. వీరందరికి బుధవారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు మహిళలకు, 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పురుషులకు గ్రామంలోని పాత పాలకేంద్రం వద్ద పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు శివాలయంలో మెగా వైద్యశిబిరం

పెదకాకాని: పెదకాకాని శివాలయంలో నవంబరు 30వ తేదిన ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఫౌండేషన్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత్‌శర్మ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులు, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేందుకు ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

200 కి.మీ సైకిల్ యాత్ర

సీజీఎస్టీ కమిషనర్‌కు సత్కారం



కమిషనర్ నరసింహారెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు

నగరంపాలెం: ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించడంలో జీఎస్టీ అన్నివేళల్లో ముందు వరుసలో ఉంటుందని సీజీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 200 కి.మీ. సైకిల్ యాత్ర నిర్వహించి, రాజ్యాంగ విలువలను ప్రజలకు తెలియజేసిన సీజీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి, వారి బృందాన్ని మంగళవారం కన్నవారితోటలోని జీఎస్టీ భవన్‌లో ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఉద్యోగ సంఘజ నాయకులు గాదె శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తేవాలనే భావన కమిషనర్‌కు రావడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. శాఖమూరి శ్రీనివాస్, బిల్లా ప్రశాంత్, ఈశ్వర్, కె.శ్రీను, శరత్, ప్రదీప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

గుంటూరు వెస్ట్: ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో ఉచిత దంత, బీపీ, షుగర్ వైద్య శిబిరం నిర్వహిస్తామని కార్యదర్శి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు. రక్త పరీక్షలతోపాటు నిపుణులైన వైద్యులు పాల్గొని సేవలందిస్తారన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

ఏఎన్‌యూ: ఎయిడ్స్ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆ వ్యాధిగ్రస్తుల పట్ల సోషియాలజీ, సోషల్ వర్క్ విద్యార్థుల బాధ్యతలపై మంగళవారం యూనివర్సిటీలో అవగాహనా కార్యక్రమం జరిగింది. సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగంలో జరిగిన ఈ అవగాహనా కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య .వెంకటేశ్వర్లు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగంతో మంగళగిరిలోని మారుతి మహిళా సొసైటీ ఎంఓయూ కుదుర్చుకుందని తెలిపారు. ఈ ఎంఓయూ ద్వారా రెండు సంస్థలు కలిపి సంయుక్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించనున్నామన్నారు. విభాగ అధ్యాపకులు ఆచార్య ఎం.త్రిమూర్తి రావు, ఆచార్య కె.ధనలక్ష్మి, ప్రొఫెసర్ సరస్వతి రాజు అయ్యర్, గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ రాజ్ కుమార్, పరిశోధకులు రాజేష్, స్వరూప్ పాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్సపొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నంద్యాలకుచెందిన చంద్రశేఖర్ (45) గుంటూరు నాజ్‌సెంటర్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 25న శానిటైజర్ తాగి అపస్మారక స్థితిలో చేరుకోవడంతో పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 27వ తేదీ రాత్రి మృతిచెందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 రోజుల్లో సరైన సమాధానం ఇవ్వని ఓట్లు తొలగిస్తాం

నగర కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల నిబంధనల మేరకు ఓటర్ ఆచూకీ లేకుంటే ఫార్మేట్–బి నోటీసును రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపుతున్నామని, 15 రోజుల్లో సరైన సమాధానం ఇవ్వని ఓట్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఫార్మేట్–బి, నూతన దరఖాస్తులు, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ కార్డ్‌లోని చిరునామాలో ప్రస్తుతం నివాసం లేని ఓటర్లను గుర్తించి వారికి ఫార్మేట్–బి నోటీసును రిజిస్టర్ పోస్ట్ చేశామని, 15 రోజుల్లో నిర్దేశిత ఓటర్ల నుంచి తగిన వివరణ రాకుంటే ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా వారి ఓటు తొలగించడం జరుగుతుందన్నారు. అలాగే అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించడం జరగదని, అలా ఎక్కడైనా జరిగితే పీపుల్స్ రిప్రజంటేటివ్ యాక్ట్ 1950 ప్రకారం జిల్లా ఎన్నికల అధికారికి అప్పీల్ చేయవచ్చని, లేదా నూతన ఓటు కోసం ఫారం–6 ని దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. పీఎస్ఈ (ఫోటో సిమిలర్ ఎంట్రీలు)/డీఎస్ఈ (డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలు) ఉన్న ఓటర్లకు ఫార్మేట్–ఎ ద్వారా రిజిస్టర్ పోస్ట్ చేశామని, ఓటర్లు తమ ఓటు ఎక్కడ ఉంచాలో/తొలగించాలో కన్ఫర్మేషన్ లెటర్ ద్వారా తెలియజేయాలన్నారు. పశ్చిమ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ కె.లక్ష్మీశివ జ్యోతి, ఏఈఆర్ఓలు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, సూపరిండెంట్లు సాంబశివరావు, పద్మ, రాజకీయ పార్టీ నేతలు పాల్గొన్నారు.

తగిన అనుమతులతోనే లే అవుట్లు ఉండాలి..

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేట్ వెంచర్లు, లే అవుట్లు తగిన అనుమతులతోనే ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగింపు చర్యలు తీసుకుంటారని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఏటుకూరులో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న లే అవుట్‌ను తనిఖీ చేసి తదుపరి అనుమతులపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంచర్ల రోడ్డు వైడెనింగ్ పోర్షన్, అంతర్గత రోడ్ల వెడల్పు, ప్లాట్ల కొలతలు, మార్ట్ గేజ్ ప్లాట్లు, యుటిలిటీ ఏరియా, ఎమినిటీస్ ఏరియా, ఓపెన్ స్పేస్, గ్రీనరీ, డ్రైన్ల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకొని నేరుగా తనిఖీ చేశారు. టీపీఎస్ సువర్ణ కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆందోళనకరంగా వాతావరణ మార్పులు

లక్ష్మీపురం: ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పులు ఆందోళనకరంగా మారుతున్నాయని సీనియర్ సిటిజన్స్ నాయకుడు ఆర్.వెంకటరత్నం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం చర్చాగోష్టిలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 30వ తేదీ నుంచి దుబాయ్‌లో ప్రారంభం కానున్న కాప్–28 సదస్సులో నైనా భూగోళం ఎదుర్కొంటున్న వాతావరణ పర్యావరణ సమస్యలకు ఒక పరిష్కారం దొరుకుతుందని ఆశిద్దామని అన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్రాంత అధికారి వి.ఎస్.ఎన్.మల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మేటివ్–1 పరీక్షలు ప్రారంభం



కాకుమాను: మండలంలోని గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమ్మేటివ్ పరీక్షలను ఎంఈఓ కేఎఫ్ కెనడీ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమ్మేటివ్ పరీక్షలు విద్యార్థుల ప్రగతిని తెలుసుకునేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల(బాలికల)పాఠశాలలో సీబీఎస్ఈ పరీక్షలు నిర్వహించారు. బుధవారం కాకుమాను స్కూల్ కాంప్లెక్స్, గురువారం చినలింగాయపాలెం కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. హెచ్ఎం బి.సత్యం, ఉపాధ్యాయులు ఉన్నారు.